లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు!

- నిరుపయోగంగా హాస్టల్ భవనం
- తాటికొండలో శిథిలావస్థకు చేరుతున్న వసతి గృహం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న తాటికొండ గ్రామంలో ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం నిరుపయోగంగా మారి దాదాపు పదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఎస్సీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు మారపాక రవి స్వగ్రామమైన తాటికొండలో ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనానికి నిదర్శనంగా నిలుస్తోంది. మండల పరిషత్ వైస్ చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి స్వగ్రామం కూడా తాటికొండ కావడం విశేషం. తాటికొండ తమ అమ్మమ్మ గారి ఊరని, తాటికొండ అంటే ఎనలేని ఇష్టమని పలుమార్లు చెప్పే ఆ గ్రామం పేరునే తమ ఇంటిపేరుగా మార్చుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సైతం ఈ అంశంపై స్పందించడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో తాటికొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు హైస్కూల్ చదువును తాటికొండలో చదువుకునేవారు. అయితే ఆరోజుల్లో తాటికొండలో హాస్టల్ లేకపోవడంతో ప్రతీ రోజూ విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి చదువుకునే క్రమంలో రోజూ పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. దాంతో విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నాటి మంత్రి కడియం శ్రీహరి ఆధ్వర్యంలో 1997లో తాటికొండ గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాన్ని రూ.లక్షలు వెచ్చించి నిర్మింపజేశారు. తాటికొండ హాస్టల్ స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ, కొత్తపల్లి, జిట్టెగూడెం, ప్రస్తుత చిల్పూరు మండలం కృష్ణాజీగూడెం, ఫత్తేపూర్, గార్లగడ్డతండా తదితర గ్రామాల విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఆయా గ్రామాల విద్యార్థులు ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ తాటికొండ హాస్టల్‌లో ఉండేవారు.

తొమ్మిదేళ్ల క్రితం మూతపడిన హాస్టల్..

మొదట్లో హాస్టల్ విద్యార్థులతో కళకళలాడేది. అయితే కాలక్రమేణా విద్యావ్యవస్థలో, సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన మార్పులతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య కాలక్రమేణా తగ్గింది. చుట్టుపక్కల గ్రామాల్లో పలు ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు కావడం, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. దాంతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన నూతన నిబంధనల మేరకు హాస్టల్‌లో నిర్దేశించిన సంఖ్య కన్నా తక్కువ విద్యార్థులున్న హాస్టల్‌లను మూసివేశారు. దాంతో 2015 సంవత్సరం వరకు కాస్త అటు ఇటుగా నడిచిన హాస్టల్ 2015లో పూర్తిగా మూతపడింది.

శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనం..

మూతపడిన హాస్టల్ భవనాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దాంతో హాస్టల్ భవనం ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరింది. దాని తోడు కొందరు స్థానికులు అందులోనే పశువులను కట్టేస్తుండగా పశువుల కొట్టంగా మారుతోంది. అయితే ప్రస్తుతం హాస్టల్ స్థలం కబ్జా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామంలో నిరుపయోగంగా మారిన ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి. గతంలో కడియం శ్రీహరి మంత్రిగా ఉన్న సమయంలో హాస్టల్‌ను కట్టించారు. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న శ్రీహరి ప్రత్యేక చొరవతో భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తారనే నమ్మకం మాకు ఉంది.

– వక్కల రాజు, కాంగ్రెస్ నాయకుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ భవనం సమస్యను ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో త్వరలో భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

– చల్లా సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ

క్లుప్తంగా

'వేద'లో స్వర్ణ ప్రాశన



జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్‌నెస్ హాస్పిటల్ పుష్యమి నక్షత్రం పురస్కరించుకుని డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం 0 నుంచి 16 ఏళ్లలోపు సుమారు 150 మంది పిల్లలకు ఉచితంగా స్వర్ణప్రాశన అందించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ స్వర్ణ ప్రాశన తీసుకోవడంతో పిల్లలకు మేథోశక్తి, ఎముకల పటిష్టత, జీర్ణశక్తి, చర్మకాంతి పెరుగుతుందన్నారు. ప్రతి రోజు పిల్లలు నిద్ర లేచిన తర్వాత 30 నిమిషాల పాటు సూర్యకాంతిలో ఉండే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే అరగంట పాటు యోగాతో పాటు వేప పుల్లతో బ్రష్ చేయించాలన్నారు.

ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వాలి



పాలకుర్తి: తాగు నీటికి సమస్య తలెత్తకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వడానికి ఉద్యోగులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాములు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈఓ మాట్లాడారు. కొడకండ్ల ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, సూపరింటెండెంట్ పుష్పలత, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మండల ఇన్‌ఛార్జ్ గద్దల కిశోర్, జిల్లా కార్యదర్శి అల్వాల రాజులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గ్రామ శాఖ అధ్యక్షుడిగా మేడి రాజు, ఉపాధ్యక్షుడిగా సుండు ఏకాంత, ప్రధాన కార్యదర్శిగా గిద్దెల ఏకాంత, సహాయ కార్యదర్శిగా మద్రి లక్ష్మణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నియోజకవర్గ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజ్జెల దామోదర్ మామ మేరుగు నర్సయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కొత్తపల్లిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గాదె రామన్‌రెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి సోమవారం మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పరామర్శించారు. బుచ్చిరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

సాగునీటి సమస్య పరిష్కరించాలి



చిల్పూరు: మండలంలో లింగంపల్లి, శ్రీపతిపల్లి, కొండాపూర్ గ్రామాల్లోని రైతులకు దేవాదుల పైపులైన్ ద్వారా సాగునీరు అందించి ఆదుకోవాలని నాయకులు, రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విన్నవించారు. దీంతో స్పందించిన కడియం వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో లిఫ్ట్‌కు సంబంధించిన డిజైన్ వారం రోజుల్లో తయారు చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఏదునూరి రవీందర్, గొడుగు రవీందర్, సత్తయ్య, రవీంద్రచారి, నరేందర్, బోయిన ఎల్లయ్య, రాజయ్య పాల్గొన్నారు.

గ్రామ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల

దేవరుప్పుల: సింగరాజుపల్లి గ్రామానికి సంబంధించిన ఆర్థిక పరిస్థితి పైన అదే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఇప్ప పృథ్వీ రెడ్డి సోమవారం శ్వేత పత్రం విడుదల చేశాడు. గత 5 సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామానికి అందిన నిధులు, పెట్టిన ఖర్చుల వివరాలు గ్రామస్తులకు బహిర్గతపరిచారు. గత 5 సంవత్సరాల పాలనలో గ్రామానికి రూ.1,38,78,031 నిధులు వచ్చినట్టు తెలిపారు.

పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించాలి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిల్పూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులతో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తహసీల్దార్‌ను రైతుల పక్షాన సాదం రమేశ్ నిలదీస్తే అతనిపై అక్రమ కేసు పెట్టారన్నారు. వెంటనే తహసీల్దార్ కేసును ఉపసంహరించుకోవాలన్నారు. ఉన్నతాధికారులు ఇక్కడి అధికారులపై విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. పార్టీ మండల సహాయ కార్యదర్శి బోనగిరి కుమార్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సాదం రమేశ్, అపరాదపు రాజు, పోలు సంపత్, గుంటి భీములు, మహేష్, చిన్న అయిలయ్య, నలిమెల శంకర్, వెలిశాల సమ్మయ్య, సుంక రాజు, సాదం రాజు, గోలి శంకర్, గట్టయ్య రైతులు పాల్గొన్నారు. అనంతరం డీటీ విమలకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

ముందస్తు సస్యరక్షణతో కలుపు నివారణ



రైతులకు సూచనలిస్తున్న విజయ్‌రెడ్డి

కొడకండ్ల: విత్తనాలు వేసిన 48 గంటల్లోపు ప్రీ ఎమర్జెన్స్ హెర్బీసైడ్స్ స్ప్రే చేసుకోవాలని తద్వారా కలుపును నియంత్రించవచ్చని మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి సూచించారు. మండలంలోని హక్యాతండాలో వరి నారుమడులను ఆయన సోమవారం పరిశీలించి రైతులకు సూచనలు, జాగ్రత్తలను వివరించారు. పత్తిలో అంతర పంటగా కంది పంటను సాగు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని, భూమిలో నత్రజని శాతం పెరుగుతుందని ఏఓ సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కొంగ నవ్య, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బియ్యం అందజేస్తున్న నర్సింహారెడ్డి

నర్మెట: మండల కేంద్రంలో 1998–99 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు తోటి స్నేహితురాలు గొడుగు కవిత భర్త మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ. 15వేల సాయం అందజేశారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యార్థులు చిర్ర మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, కర్ణాకర్, నరేష్, రాజేంద్రప్రసాద్, రవి, సంతోష్, మల్లేష్, రాజయ్య, కృష్ణ, రాజు, తిరుపతి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత..

మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిర పిన్నోజు కృష్ణ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి 50 కిలోల బియ్యాన్ని అందించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్, దేవులపల్లి భాగ్యలక్ష్మి, పులిరేణుక, పల్లె ప్రభుదాస్, నరేష్, శ్రీనివాస్, రాజశేఖర్, కర్ణాకర్, భూపతిరెడ్డి, రవి, దయాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వానలు కురవాలని బతుకమ్మ ఆట



తరిగొప్పుల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రఘునాథపల్లి: కప్పతల్లి ఆడుతున్న గ్రామస్తులు

తరిగొప్పుల: ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని మహిళా సంఘాల సభ్యులు సోమవారం బతుకమ్మ ఆటలు ఆడారు. మండలంలోని శివారు జగ్గయ్యపేటలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించిన అనంతరం మహిళా సంఘాల సభ్యులు అంజనేయ స్వామి ఆలయం సమీపంలో బతుకమ్మ ఆడిపాడారు.

కప్పతల్లి ఆట..

రఘునాథపల్లి: శ్రీమన్నారాయణపురంలో సోమవారం వర్షాలు కురవాలంటూ గ్రామ మహిళలు, చిన్నారులు కప్పతల్లి ఆట ఆడారు. కర్రకు బట్టలో పెట్టిన కప్పను కట్టి గడపగడప తిరుగగా వారు దనాఇపై నీరు పోశారు. అనంతరం గ్రామ దేవత వద్ద మొక్కులు చెల్లించి కప్పను వదిలారు.

ఎమ్మెల్సీ మల్లన్నను కలిసిన 'కొమ్మూరి'



జనగామ: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి విజయం సాధించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లన్నను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కుమారుడు కొమ్మూరి రాకేష్‌రెడ్డి ఉన్నారు.

భూ పత్రాలతో సాగు రైతుల ఆందోళన



భూపత్రాలతో ఆందోళన చేస్తున్న సాగు రైతులు

రఘునాథపల్లి: భూకబ్జాదారుల నుంచి తమ భూములను కాపాడాలంటూ మండలంలోని రామన్నగూడెం రైతులు సోమవారం వారికి సంబంధించిన పత్రాలతో ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా రైతులు వాకిటి వెంకన్న, సోమయ్య, నర్సయ్యలు మాట్లాడుతూ మండలంలోని కోడూరు రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబరు 181లో 10.30 ఎకరాల వ్యవసాయ భూమిని 70 ఏళ్ల క్రితం కోడూరు గ్రామానికి చెందిన గడ్డం నర్సింహారెడ్డి వద్ద కొనుగోలు చేయగా అప్పటి తాతముత్తాతల నుంచి 13 కుటుంబాల వారిమి భూమిని సాగు చేసుకుంటున్నామని అన్నారు. ఇటీవల కొందరు భూకబ్జాదారులు ఎలాంటి ఆధారాలు లేకుండా తాము గడ్డం నర్సింహారెడ్డి వారసులమంటూ క్షేత్రస్థాయిలోకి వచ్చి మమ్ములను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పూర్తి సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు





కలెక్టర్‌ను సత్కరిస్తున్న టీఎన్జీఓ నాయకులు, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు..

జనగామ: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయంలో అంకిత భావంతో పని చేసిన ప్రతీ ఉద్యోగికి కలెక్టర్ రిజ్వాన్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా ముగించిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో టీఎన్జీఓ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఎడీ.ఖాజాషరీఫ్ ఆధ్వర్యాన కలెక్టర్‌తోపాటు రెవెన్యూ, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు రాజనరసయ్య, కోశాధికారి ఎండీ.హాఫీజ్, ఉపాధ్యక్షులు సంపత్ కుమార్, ఉప్పలయ్య, ప్రభాకర్, చందర్, శ్రీధర్, మధు, అబ్బసాయిలు, విష్ణు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కొడకండ్ల: ర్యాలీ తీస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



నర్మెటలో..



పాలకుర్తి టౌన్: వావిలాలలో..

కొడకండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య ఉంటుందని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జక్కుల ప్రభాకర్ అన్నారు. సోమవారం రామవరం గ్రామంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు శ్రీహరి, ఆంజనేయస్వామి, శ్వేత, నలిని, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు యాదలక్ష్మి, సఫియాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

నర్మెట: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బడి బాట ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్‌ఎంలు ఆంజనేయచారి, రవికుమార్, కనుకయ్య, నరేందర్, స్వప్న, పద్మ, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పిల్లలను బడుల్లో చేర్పించాలి

పాలకుర్తి టౌన్: మండలంలోని వావిలాల, వల్మిడి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు సరిత, హరిత, తిరుమల దేవి, హరిప్రియ, సోమమల్లయ్య పాల్గొన్నారు.

పూర్తి కావస్తున్న ఏఏపీసీ పాఠశాలల పనులు



కస్తూర్బాగాంధీ పాఠశాలలో మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి

లింగాలఘణపురం: మండలంలోని 19 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల (ఏఏపీసీ) కమిటీలతో చేపట్టిన పనులు పూర్తి కావస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా అన్ని పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఏఏపీసీలను ఏర్పాటు చేసి నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అమ్మ ఆదర్శ కమిటీలతో పేరుతో స్థానిక మహిళ సంఘాల గ్రామైక్య కమిటీ అధ్యక్షులతో పనులు చేయించారు. అందులో నాలుగు విభాగాలుగా విభజించి విద్యుత్, త్రాగు నీరు, మరుగుదొడ్లు, మైనర్ మరమ్మతుల పేరుతో పనులను చేపట్టింది. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలో 19 పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో 90 శాతం పూర్తయ్యాయి. ఆలస్యంగా నిధులు మంజూరైన మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో కూడ పనులు పూర్తి కావస్తున్నాయి. నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ప్రత్యేక పర్యవేక్షణతో పనులు పూర్తి చేయిస్తున్నారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

తరిగొప్పుల: మండలంలోని బొంతగట్టునాగారంలో రెండు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన ఇరుమల్ల బీరయ్య, సత్రబోయిన రాజుకు చెందిన ఐచర్, స్వరాజ్ ట్రాక్టర్లు ఇంటి ముందు ఆదివారం నిలిపారు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్ బ్యాటరీల చోరీకి పాల్పడ్డారు. దీంతో సదరు రైతులకు రూ.12 వేల చొప్పున ఆర్థిక నష్టం కలిగిందని వాపోయారు. దీంతో బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



హెచ్‌ఎంలకు పుస్తకాలను అందజేస్తున్న గోవర్ధన్

చిల్పూరు: ఈ విద్యాసంవత్సరానికి గాను మండలానికి 11 వేల 924 వందల పాఠ్యపుస్తకాలు వచ్చాయని విద్యాశాఖ మండల నోడల్ అధికారి దాసరి గోవర్ధన్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు ఆయన పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, బడిబాట కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం చేపట్టి విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు.

పాఠశాలలను శుభ్రంగా ఉంచాలి



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న జీపీ సిబ్బంది

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య అన్నారు. మంగళవారం మండలంలోని కొడవటూర్ గ్రామంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో చెత్తా చెదారాన్ని జీపీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ఆ సందర్భంగా కార్యదర్శి మాట్లాడారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో చెత్తా చెదారం పెరిగిందని తెలిపారు. దీంతో ఈనెల12న స్కూళ్లు పునఃప్రారంభం కానున్నందున పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించామన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలకు కూడా నీళ్లు పట్టించడం జరిగిందని తెలిపారు. పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు లబ్ధిదారుల ఎంపిక



దేవరుప్పుల: నిబంధనల మేరకు త్వరలో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేస్తామని తహసీల్దార్ హుస్సేన్ వెల్లడించారు. మండలంలోని ధర్మాపురం, కామారెడ్డిగూడెం, కడవెండిలో గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన 93 ఇళ్లలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు ఇళ్లను దురాక్రమణ చేయగా అధికా రులు సందర్శించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ నవీన్ కుమార్, ఎస్సై చెన్న కేశవులు, హౌజింగ్ ఏ.ఈ రమేష్ , రమేష్, భాస్కర్, చింత నిఖిల్, కాంట్రాక్టర్ యాదగిరి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.